

భద్రత కల్పించాలి



మహిళా డాక్టర్లు, సిబ్బంది అస్పత్రుల్లో ఎలాంటి రక్షణ లేని వాతావరణంలో పని చేస్తున్నారు.ఈ విషయం కోల్‌కతా ఘటనతో స్పష్టంగా తెలిసింది. అభద్రతా భావనలో పని చేయడం చాలా ఇబ్బందిగా ఉంటుంది. మానసికంగా ఒత్తిడితో విధులపై దృష్టి సారించలేరు. ఈ పరిస్థితి నుంచి వైద్య సిబ్బంది బయటపడేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. మహిళా వైద్యులు, నర్సులు, ఇతర సిబ్బందికి రక్షణ కల్పించే దిశగా అందరూ ఆలోచన చేయాల్సిన అవసరం ఉంది.

– మాసీలామణి, విశ్రాంత డీఎంహెచ్‌ఓ

ధైర్యం కల్పించాలి



ప్రజల ప్రాణాలను కాపాడే వైద్య సిబ్బందిపై దాడులు దారుణం. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన అమానుషం. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా మహిళా వైద్య సిబ్బంది భద్రతకు కఠిన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వాలు చర్యలు తీసుకుని ధైర్యంగా విధులు నిర్వహించే పరిస్థితిని వైద్యసిబ్బందిలో కల్పించాలి.

–కామేశ్వరి, ఏఎన్‌ఎం, చేజర్ల

కఠిన చట్టాలు అవసరం



మహిళలపై జరిగే దాడులను అరికట్టేందుకు కఠిన చట్టాలు అవసరం. మహిళలపై దాడులకు పాల్పడే మృగాళ్లను శిక్షించేందుకు ఇప్పుడున్న చట్టాలు సరిపోవు. పాఠశాల, కళాశాల స్థాయి నుంచే మహిళలకు మానసిక ధైర్యంతో పాటు కరాటేను నేర్పించాలి. కోల్‌కతాలో వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటన దారుణం. దోషులను కఠినంగా శిక్షించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా వైద్యులు, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలి.

– డాక్టర్ షేక్ మెహతాబ్, చేజర్ల పీహెచ్‌సీ



క్లుప్తంగా

దుత్తలూరు ఎస్సైగా ఆదిలక్ష్మి



దుత్తలూరు: దుత్తలూరు ఎస్సైగా పీ ఆదిలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జలదంకి ఎస్సైగా పనిచేస్తున్న ఆమె బదిలీపై దుత్తలూరుకు వచ్చారు. నూతన ఎస్సైను పోలీసులు సిబ్బంది, పలువురు రాజకీయ నాయకులు కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

అల్లూరు ఎస్సైగా కిషోర్‌బాబు



అల్లూరు: అల్లూరు ఎస్సైగా కే కిషోర్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. కందలేరు స్టేషన్ ఎస్సైగా పనిచేస్తున్న కిషోర్‌బాబు బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఎస్సైగా పనిచేస్తున్న శ్రీనివాసులరెడ్డి వీఆర్‌కు బదిలీ అయ్యారు. నూతన ఎస్సైకు పోలీసు సిబ్బంది పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. నూతన ఎస్సై మాట్లాడుతూ మండలంలో అసాంఘీక కార్యకలాపాలకు పాల్పడతే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

కలిగిరి ఎస్సైగా ఉమాశంకర్



కలిగిరి: కలిగిరి ఎస్సైగా ఎం ఉమాశంకర్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. దుత్తలూరు ఎస్సైగా పనిచేస్తున్న ఆయన బదిలీపై కలిగిరి వచ్చారు. ఇప్పటి వరకు ఎస్సైగా విధులు నిర్వహిస్తున్న సంతోష్‌రెడ్డి వీఆర్‌కు వెళ్లారు. నూతన ఎస్సై ఉమాశంకర్ మాట్లాడుతూ గ్రామాల్లో పేకాట, కోడిపందాలు వంటి జూదాలు నిర్వహించిన, అసాంఘీక కార్యకలపాలకు పాల్పడిన కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. గ్రామాల్లో ఏమైనా సమస్యలు ఉంటే 94407 00098 నంబరుకు సమాచారం ఇవ్వాలని కోరారు.

పాతకక్షల నేపథ్యంలో వ్యక్తిపై దాడి

జలదంకి: పాతకక్షల నేపథ్యంలో మండలంలోని తిమ్మసముద్రం గ్రామానికి చెందిన దివి లోకేష్ నాయుడుపై అదే గ్రామానికి చెందిన తోటకూర సురేష్ ఆదివారం రాత్రి దాడికి పాల్పడ్డాడు. ఈ ఘటనలో లోకేష్‌నాయుడు తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. తిమ్మసముద్రానికి చెందిన లోకేష్‌నాయుడు, తోటకూర సురేష్ నడుమ ఇంటి స్థలం విషయమై కోర్టులో కేసు నడుస్తోంది. ఈ నేపథ్యంలో లోకేష్ నాయుడు ఆదివారం రాత్రి వ్యక్తిగత పని నిమిత్తం కేశవరం గ్రామానికి వెళ్లి తిరిగి వస్తుండగా, తోటకూర సురేష్ తన అనుచరులతో కలిసి కళ్లల్లో కారం కొట్టి మారణాయుధాలతో దాడికి పాల్పడ్డారు. ఈ దాడిలో లోకేష్‌నాయుడుకు తీవ్రంగా గాయపడగా స్థానికులు చికిత్స నిమిత్తం కావలి ఏరియా వైద్యశాలకు తరలించారు. ఈ ఘటనపై జలదంకి పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నేడు హిందూ చైతన్య వేదిక ర్యాలీ

వింజమూరు(ఉదయగిరి): మహిళలపై జరుగుతున్న దాడులు, లైంగికదాడులకు నిరసనగా వింజమూరులోని శివాలయం నుంచి బంగ్లా సెంటర్ వరకు మంగళవారం ఉదయం 10గంటలకు ర్యాలీ నిర్వహించనున్నట్లు హిందూ చైతన్య వేదిక నిర్వాహకులు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పట్టణ ప్రజలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు.

ట్రాఫిక్ నిబంధనలను పాటించాలి

సంగం: ఆటో డ్రైవర్లు ట్రాఫిక్ నిబంధనలను విధిగా పాటించాలని సంగం సీఐ వేమారెడ్డి సూచించారు. స్థానిక సర్కిల్ కార్యాలయంలో ఆటో డ్రైవర్లకు అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ నిత్యం అప్రమత్తంగా ఉండి వాహనాలను నడుపుతూ ప్రయాణికులను సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాలని సూచించారు. ఆయన వెంట ఎస్సై నాగార్జునరెడ్డి ఉన్నారు.

రేపటి నుంచి ఎస్‌ఏ పరీక్షలు

సీతారామపురం: మండలంలోని పాఠశాలల్లో 1 నుంచి 10వ తరగతి వరకు చదువుతున్న విద్యార్థులకు బుధవారం నుంచి సెప్టెంబరు 4వ తేదీ వరకు స్వీయ మదింపు పరీక్షలు (ఎస్ఏ-1) నిర్వహించనున్నట్లు ఎంఈఓ షేక్ మస్తానవలి సోమవారం తెలిపారు. 1 నుంచి 8వ తరగతి వరకు విద్యార్థులకు ఓఎమ్మార్‌తో పరీక్షలు నిర్వహించాలని సూచించారు. ఓఎమ్మార్‌లను సీఆర్‌ఎంటీల ద్వారా అన్ని పాఠశాలలకు అందజేస్తామన్నారు. 1 నుంచి 5 తరగతి వరకు ఆయా స్కూల్ కాంప్లెక్స్ పాఠశాలల నుంచి, 6 నుంచి 10వ తరగతి వరకు ఎంఈఓ కార్యాలయం నుంచి ఏరోజుకు ఆరోజు ప్రశ్నాపత్రాలను ప్రధానోపాధ్యాయులు తీసుకెళ్లాలని తెలిపారు. విద్యార్థుల మార్కులను సీఎస్‌ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేయాలని సూచించారు.



ఏఎస్‌పేటలో రుక్మిణి, కృష్ణుని కల్యాణోత్సవం



అల్లూరులో గోమాతకు పూజలు



ఆత్మకూరురూరల్ పరిధిలోని బట్టేపాడులో..

వైభవంగా కృష్ణాష్టమి వేడుకలు

ఆత్మకూరు, కావలి, ఉదయగిరి నియోజకవర్గాల్లో కృష్ణాష్టమి వేడుకలను సోమవారం వైభవంగా నిర్వహించారు. కృష్ణుడి మందిరాల్లో ఉదయం విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు.

ఆత్మకూరు: పట్టణంలోని టెంకాయతోపులో ఉన్న రాధాకృష్ణ మందిరం, యాదవవీధిలోని కృష్ణ మందిరం, కన్యకాపరమేశ్వరి ఆలయం, సుందరమ్మ కోదండ రామాలయాల్లో శ్రీకృష్ణుడికి విశేష పూజలు నిర్వహించారు. యాదవవీధిలోని కృష్ణమందిరం, టెంకాయతోపులోని రాధాకృష్ణ మందిరాల్లో శ్రీకృష్ణుడు, రుక్మిణి, సత్యభామకు కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు భారీ స్థాయిలో అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు. కన్యకాపరమేశ్వరి ఆలయంలోని కృష్ణ మందిరంలో రాత్రి కోలాటాన్ని ప్రదర్శించారు. చిన్నారులు కృష్ణుడు, రాధా,గోపికల వేషధారణలతో సందడి చేశారు.

ఆత్మకూరురూరల్: బట్టేపాడులో కృష్ణాష్టమి వేడుకలు వైభవంగా ప్రారంభమయ్యాయి. పొదలకూరుకు చెందిన ప్రబోధసేవా సమితి, ఇందూ జ్ఞానవేదిక పర్యవేక్షణలో రుక్మిణి సత్యభామా సమేత కృష్ణుడి విగ్రహాలను కొలువుదీర్చి విశేష పూజలు నిర్వహించారు. వచ్చే నెల 2వ తేదీ వరకు వేడుకలను వైభవంగా నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. చివరి రోజున కృష్ణుడి ఊరేగింపు కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించనున్నట్లు వివరించారు.

అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలోని కృష్ణ మందిరంలో విశేష పూజలు, కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. రుక్మిణి, కృష్ణుడి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి కల్యాణ వేదికపై ఆశీనులను చేసి వేదమంత్రోచ్ఛారణల నడుమ శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. భక్తులు విశేషంగా హాజరై కల్యాణాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.



జలదంకిలోని ఓ పాఠశాలలో ఉట్టి కొడుతున్న చిన్నారులు

సంగం: మండల ప్రజలు కృష్ణాష్టమిని ఘనంగా జరుపుకొన్నారు. సంగంలోని శివాజీ సెంటర్‌లోని కృష్ణ మందిరంలో విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. చిన్నారులు శ్రీకృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు.

ఉదయగిరి: ఉదయగిరి, వింజమూరు మండలాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడి మందిరాల్లో విశేష పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నప్రసాద వితరణ చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవాలను నిర్వహించారు. చిన్నారులు కృష్ణుడు, గోపికల వేషధారణలతో సందడి చేశారు.

వరికుంటపాడు: మండల ప్రజలు కృష్ణాష్టమిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. గువ్వాడిలో గ్రామస్తులు శ్రీకృష్ణుడి విగ్రహాన్ని కొలువుదీర్చి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం ఉట్టి మహోత్సవం, గ్రామోత్సవం, రాత్రి కన్నయ్య పవళింపు సేవ, తదితర కార్యక్రమాలు నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

జలదంకి: స్థానిక యాదవవీధిలోని శ్రీకృష్ణుని మందిరంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణుని విశేష పుష్పాలతో అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తుల హరినామ సంకీర్తనతో మందిరం ప్రతి ధ్వనించింది. అనంతరం వాహన, ఊంజల్ సేవలు, మహా మంగళహారతి, తీర్థ ప్రసాద వితరణ, తదితర కార్యక్రమాలను నిర్వహించారు. స్థానిక శ్రీసాయి ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో ప్రిన్సిపల్ అయ్యలరెడ్డి ఆధ్వర్యంలో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. చిన్నారులు ఉట్టికొట్టారు. కృష్ణుడు, గోపికల వేషధారణలతో చిన్నారులు సందడి చేశారు.



ఆత్మకూరు: కన్యకాపరమేశ్వరి ఆలయంలో విశేషాలంకరణలో శ్రీకృష్ణుడు

దుత్తలూరు: మండలంలోని దుత్తలూరు సెంటర్‌లో త్రైత సిద్ధాంత ప్రభోద సేవా సమితి ఆధ్వర్యంలో శ్రీకృష్ణుని విగ్రహాన్ని ఏర్పాటు చేసి ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. భగవద్గీత శ్లోకాలు, శ్రీకృష్ణుని భక్తి పాటలు ఆలపించారు. దుత్తలూరులోని శ్రీకృష్ణాశ్రమం, వేణుగోపాలస్వామి ఆలయాల్లో కృష్ణాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. కృష్ణుడికి విశేషాభిషేకాలు, పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. సాయంత్రం ఉట్టి మహోత్సవాన్ని కోలాహలంగా నిర్వహించారు.



వరికుంటపాడు మండలం గువ్వాడిలో..



వింజమూరు మండలం శంఖవరంలో..



దుత్తలూరు సెంటర్‌లో..

అల్లూరు: మండల ప్రజలు కృష్ణాష్టమిని భక్తిశ్రద్ధలతో జరుపుకొన్నారు. కృష్ణుడి మందిరాల్లో విశేష పూజలు నిర్వహించారు. అల్లూరులోని బ్రహ్మానంద గీతాశ్రమంలో గో పూజ నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

వైభవంగా కుంభాభిషేక మహోత్సవం



బాలాంజనేయస్వామి విగ్రహాన్ని తీసుకొస్తున్న భక్తులు



కలశాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

సంగం: మండలంలోని దువ్వూరులో నూతనంగా నిర్మించిన అభయాంజనేయస్వామి ఆలయంలో మహాకుంభాభిషేక మహోత్సవాలు సోమవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. తొలిరోజు ఉదయం మహాగణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశన, దీక్షాధారణ, భూశుద్ధి, దేవనాంది, సమారాధన, నివేదన, తీర్థప్రసాద వినియోగం, సాయంత్రం మృత్యసంగ్రహణం, అంకురారోహణ, యాగశాల ప్రవేశం, కలశ స్థాపన, అగ్నిప్రతిష్ఠ, జలాదివాసం, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత భక్తులు గంగాపార్వతి సమేత కోటేశ్వరస్వామి ఆలయం నుంచి కలశాల్లో జలాలను ఊరేగింపుగా తీసుకొచ్చారు. అనంతరం కలశాలను పర్ణశాలలో ఉంచి పూజా కార్యక్రమాలు నిర్వహించారు.

ఇష్టానుసారంగా టీచర్ల సర్దుబాటు తగదు

వింజమూరు(ఉదయగిరి): వింజమూరు మండలంలో టీచర్ల సర్దుబాటులో ఎంఈఓలు నియమనిబంధనలను పక్కనపెట్టి ఇష్టానుసారంగా వ్యవహరించారని ఏపీటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు వేముల శివకోటారెడ్డి, మండల నాయకులు జే మోహన్‌రెడ్డి, పీ కొండారెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. మండలంలో ఏడుగురు అదనపు టీచర్లు ఉండగా, అందులో ఒకరు వింజమూరు జిల్లా పరిషత్ ఉన్న పాఠశాలకు వెళ్లారని చెప్పారు. మరో బయాలాజికల్ టీచర్‌ను ఊటుకూరు జిల్లా పరిషత్‌కు పంపాల్సి ఉన్నా గుండెమడకల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు పంపారని తెలిపారు. బయాలాజికల్ సబెక్టు టీచర్ ఊటుకూరులో మూడేళ్ల నుంచి లేరని, గుండెమడకలలో ఒకరు ఉన్నా అక్కడికే ఇంకొకరిని పంపారని వివరించారు. ఎంఈఓలు తమ ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారని, తప్పులను సరిదిద్దుకోకపోతే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసి ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు.

గాయపడిన బాలుడికి ఆర్థిక సాయం

ఆత్మకూరు: పట్టణానికి చెందిన పదో తరగతి విద్యార్థి ఎస్‌కే ఇబ్రహీం ఆదివారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. ఇబ్రహీంను తొలుత ఆత్మకూరులోని ఆస్పత్రికి తరలించారు. అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు, ఆ తరువాత తిరుపతికి తరలించారు. ఇబ్రహీం కుటుంబ ఆర్థిక పరిస్థితిని తెలుసుకున్న పట్టణానికి చెందిన డాక్టర్ జే ప్రణీత్ డాక్టర్ వింజం దొరసానమ్మ మెమోరియల్ ట్రస్ట్ తరుపున బాధిత కుటుంబానికి రూ.10 వేలు ఆర్థిక సాయాన్ని సోమవారం అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ కుమార్, వశీం, అశోక్, తదితరులు పాల్గొన్నారు.



ఆర్థిక సాయం అందజేస్తున్న డాక్టర్ ప్రణీత్

హార్డ్‌వేర్ షాపు యజమానిపై దాడి

కావలి : పట్టణానికి చెందిన హార్డ్‌వేర్ షాపు యజమాని ప్రకాష్‌పై తమిళనాడు రాష్ట్రం సేలానికి చెందిన ఏడుగురు వ్యక్తులు సోమవారం దాడికి పాల్పడినట్లు కావలి ఒకటో పట్టణ పోలీసులకు ఫిర్యాదు అందింది. వివరాలు.. బాధితుడైన ప్రకాష్ అన్న కుమారుడు గౌతమ్ సేలంలోని ఓ హార్డ్‌వేర్ షాపులో గుమస్తాగా పనిచేస్తూ కొన్ని నెలల క్రితం మానేశాడు. కాగా పది రోజుల క్రితం సదరు హార్డ్‌వేర్ షాపు యజమాని కుమార్తె కనిపించకుండా పోయింది. గతంలో తమ వద్ద గుమస్తాగా పనిచేసిన గౌతమ్ ప్రేమపేరుతో తీసుకెళ్లి ఉంటాడనే అనుమానంతో వారు సేలం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో సేలం నుంచి ఏడుగురు వ్యక్తులు సోమవారం కావలికి వచ్చారు. హార్డ్‌వేర్ షాపు యజమాని ప్రకాష్‌ను తమకు చెందిన యువతి గురించి ఆరా తీశారు. ఈ క్రమంలో వారి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. ప్రకాష్‌పై సేలం నుంచి వచ్చిన వ్యక్తులు దాడికి పాల్పడ్డారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కావలి వన్ టౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. కాగా ఇరువురు వ్యక్తులు రాజస్తాన్ రాష్ట్రానికి చెందిన వారే కావడం గమనార్హం.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మర్రిపాడు: మండలంలోని డీసీపల్లి-వెన్నవాడ రహదారిపై డీసీపల్లి శ్మశానవాటిక వద్ద సోమవారం బైక్‌ను ఆటో ఢీకొనడంతో ఓ వ్యక్తి గాయపడ్డాడు. క్షతగాత్రుడ్ని స్థానికులు ఆస్పత్రికి తరలించారు. గాయపడిన వ్యక్తి జార్ఖండ్‌కు చెందిన వ్యక్తిగా స్థానికులు గుర్తించారు. జేసీబీ హెల్పర్‌గా పనిచేస్తున్నట్లుగా తెలిసింది.

లక్ష్మానందకు జాతీయ సేవా పురస్కారం

కావలి: కావలి డివిజన్ పరిధిలో వివిధ సామాజిక సేవా కార్యక్రమాలను చేపడుతున్న లైఫ్స్ బ్లడ్ వరల్డ్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు, రెడ్‌క్రాస్ కావలి శాఖ సర్వ్ కన్వీనర్ బీద లక్ష్మానందకు డాక్టర్ ఏపీజే అబ్దుల్‌కలాం జాతీయ సేవా పురస్కారం లభించింది. విజయవాడకు చెందిన మదర్ సర్వీసెస్ సొసైటీ ద్వితీయ వార్షిక వేడుకలను అక్కినేని నాగేశ్వరరావు కళా కేంద్రంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ సేవా పురస్కార సంస్థ అధ్యక్షుడు మల్లాది ప్రసాద్‌రావు చేతుల మీదుగా బీదకు జాతీయ సేవా పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత మాట్లాడుతూ తన సామాజిక సేవలను గుర్తించి పురస్కారాన్ని అందజేసిన మదర్ సర్వీస్ సొసైటీ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. తాను అందుకున్న పురస్కారం తనకు తోడ్పాటును అందించిన సేవా బృందాల్లోని సభ్యులతో పాటు రెడ్‌క్రాస్ సభ్యులకు చెందుతుందన్నారు.



ఎమ్మార్పీఎస్ విజయోత్సవ ర్యాలీ

దుత్తలూరు: మండలంలోని భైరవరంలో ఎమ్మార్పీఎస్ నాయకులు సోమవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ఎంఎస్‌పీ సీనియర్ నాయకుడు యద్దనపూడి రమణయ్య మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణమాదిగ చేపట్టిన పోరాటం ఫలించిందన్నారు. ఎస్సీ వర్గీకరణపై సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుతో మాదిగ, మాదిగ ఉపకులాల్లో వెలుగులు రానున్నాయన్నారు. ఎంఎస్‌పీ మండల ఇన్‌చార్జి గొల్లపల్లి మోహన్‌రావు, జాతీయ నాయకుడు గొల్లపల్లి శ్రీనివాసులు, జిల్లా అధ్యక్షుడు పందిటి అంబేద్కర్, బకీరు జాషువా, వడ్లపల్లి కృష్ణయ్య, గంగపట్ల సింహాద్రి, తదితరులు పాల్గొన్నారు.



ఇసుక ట్రాక్టర్లు... మాకు కనబడవు

- యథేచ్ఛగా ఇసుక అక్రమ రవాణా
- పట్టించుకోని పోలీస్, సెబ్ అధికారులు
- చెలరేగిపోతున్న తమ్ముళ్లు

ఉదయగిరి: నియోజవర్గ వ్యాప్తంగా ఇసుక అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. దీనిని నివారించాల్సిన పోలీసు, సెబ్ అధికారులు ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. దీనికి కారణం ఈ దందా నడిపిస్తున్నది టీడీపీ నేతలు కావడమే. గత వైఎస్సార్‌సీపీ పాలనలో ఇసుక రవాణాపై గగ్గోలు పెట్టిన టీడీపీ నేతలు ఇప్పుడు ఇసుక అక్రమ రవాణా చేస్తూ రూ.లక్షల్లో సంపాదిస్తున్నారు. టీడీపీ అధికారంలోకి వస్తే ఇసుక ఉచితంగా ఇస్తామని నమ్మబలికింది.దీంతో సామాన్య జనం వాగులు, వంకలు, నదుల్లో ఇసుక తమ అవసరాల మేరకు తెచ్చుకోవచ్చని ఆశ పడ్డారు. నమ్మి ఓట్లు వేశారు. సీన్ రివర్స్ అయింది. ట్రాక్టర్ ఇసుకకు గతంలో కంటే ఎక్కువ ధర చెల్లించాల్సి వస్తోంది.దీంతో గృహ నిర్మాణదారులు బెంబేలెత్తుతున్నారు.

ఆగిన గృహ నిర్మాణాలు

ఇసుక ధర అందుబాటులో లేకపోవడంతో నియోజవర్గ వ్యాప్తంగా గృహ నిర్మాణాలు చాలా తక్కువగా జరుగుతున్నాయి. దీంతో నిర్మాణ రంగంపై ఆధారపడే మేస్త్రీలు, కూలీలు, ఇతర పని వారు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వంలో మంజూరైన గృహ నిర్మాణాలను సైతం ఇసుక లేక పనులు నిలిపివేశారు. అధికార పార్టీ నేతల వాహనాల్లో కాకుండా ఇతర వాహనాల్లో ఇసుకను తెప్పించుకుంటే పోలీసులు పట్టుకుంటున్నారు. టీడీపీకి చెందిన ఇసుక అక్రమ రవాణా వాహనదారులకు అధిక ధర చెల్లించలేక పనులు నిలిపేశారు. దీంతో నిర్మాణం రంగం ఇబ్బందుల్లో ఉంది.

చోద్యం చూస్తున్న అధికారులు

ఇంటి అవసరాల కోసం పిల్లాపేరు నుంచి గంపెడు ఇసుక తెచ్చుకుంటే వెంటనే వాలిపోయి ఫైన్ వేసే పోలీస్,సెబ్ అధికారులు అక్రమ రవాణా కళ్లెదుట సాగుతున్న నోరు మెదపడం లేదు.ఈ వ్యవహారం వెనుక టీడీపీ నేతల ప్రమేయం ఉండడం, వారికి ప్రతినెలా మామూళ్లు అందడమేనన్న విమర్శలు ఉన్నాయి. మొత్తం మీద టీడీపీ కూటమి అధికారంలోకి వచ్చిన మరుసటి రోజు నుంచే ఆ పార్టీ నేతలు విచ్చలవిడిగా ఇసుక, మట్టి దోచేస్తున్నారు. ధరలు విపరీతంగా పెంచేసి వినియోగదారుల నడ్డి విరుస్తున్నారు.



పిల్లాపేరులోని ఇసుకను జేసీబీ సాయంతో ట్రాక్టర్లలో తరలిస్తున్న దృశ్యం



ఈ చిత్రంలో ఉదయగిరి ఎంపీడీఓ కార్యాలయం మీదుగా ఇసుక రవాణా చేస్తున్న ట్రాక్టర్ అధికార పార్టీ నేతది. సదరు నేత ప్రతిరోజూ రాత్రి, పగలు అనే తేడా లేకుండా తిరుమలాపురం వద్ద ఉన్న పిల్లాపేరు నుంచి ఇసుకను అక్రమంగా తరలిస్తున్నారు. ఉదయగిరి పోలీసు స్టేషన్, ఎంపీడీఓ, తహసీల్దార్ కార్యాలయాల మీదుగానే ట్రాక్టర్లతో అక్రమ రవాణాను సాగిస్తున్నారు. ఈ తంతు ప్రజలందరికీ కనిపిస్తున్నా అధికారులకు మాత్రం కనిపించడం లేదు. ఈ దందా ఒక్క ఉదయగిరిలోనే కాదు వరికుంటపాడు, కొండాపురం, వింజమూరు మండలాల్లో నిత్యం సాగుతున్నా సెబ్, పోలీసు అధికారులు కన్నెత్తి చూడడం లేదు.